# నారాయణఖేడ్‌లో నాటికి.. నేటికి

# 'జమీన్ ఆస్మాన్ ఫరక్'

ఆగం కావద్దు... అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- బీఆర్ఎస్ హయాంలో నారాయణఖేడ్ అన్ని రంగాల్లో అభివృద్ధి
- కర్ణాటక రైతుల అవస్థలు రోజూ చూస్తున్నారు...వారి కష్టాలు మీకు వద్దు
- ఖేడ్ హీరో భూపాల్‌రెడ్డిని మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలి
- ప్రభుత్వం రాగానే స్వయంగా వచ్చి బసవేశ్వర లిఫ్టు ప్రారంభిస్తా..
- నల్లవాగు లిఫ్టు ఇరిగేషన్ సాంక్షన్ బాధ్యత నాదే....
- బీసీ గురుకుల పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలు మంజూరు చేస్తా
- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి హేయమైన చర్య
- నారాయణఖేడ్ ప్రజా ఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్

సంగారెడ్డి అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ఉన్న నారాయణఖేడ్‌కు బీఆర్ఎస్ పరిపాలనలో ఉన్న నారాయణఖేడ్‌కు జమీన్ ఆస్మాన్‌కు ఉన్నంత ఫరక్ ఉన్నదని, బీఆర్ఎస్ హయాంలో నారాయణఖేడ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అన్నారు. నారాయణఖేడ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, నారాయణఖేడ్‌ను అభివృద్ధి చేసిన హీరో భూపాల్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభ జరిగింది. సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఓట్లు వచ్చినప్పుడు ప్రజలు ఆగం కావద్దని, అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏ పార్టీ చరిత్ర ఏమిటో, ఏపార్టీ వైఖరి ఏమిటో ఓటర్లు ఆలోచించాలన్నారు. నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందు పరిస్థితి ఎలా ఉండేది ఓటర్లు ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నారాయణఖేడ్ ప్రజల తాగునీరు, సాగునీరు, కరెంటు కష్టాలు తీర్చిందని తెలిపారు. పొరుగునే ఉన్న కర్ణాటక రైతుల గతి ఏమవుతున్నదో ఇక్కడి ప్రజలు, రైతులు గమనిస్తూనే ఉన్నారు. కర్ణాటక రైతులు పడుతున్న కష్టాలు ఇక్కడి రైతులకు వద్దని, నారాయణఖేడ్ రైతులు సంతోషంగా ఉండాలంటే మరోమారు బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని రైతులు, ప్రజలను కోరారు.



నారాయణఖేడ్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ పక్కన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**బసవేశ్వర ఎత్తిపోతల...**

**నల్లవాగుపై లిఫ్టు ఏర్పాటు నా బాధ్యత**

నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని స్వయంగా ప్రారంభిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వద సభలో తెలిపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నల్లవాగుపై లిఫ్టు కావాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నల్లవాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసే బాధ్యత నేనే తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు అప్పుడప్పుడు ఎండిపోతుందని ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును సింగూరు ప్రాజెక్టును లింకు చేసినట్లు తెలిపారు. ఇకపై సింగూరు ప్రాజెక్టు శాశ్వత జలవనరుగా మారుతుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు పూర్తయితే నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. బసవేశ్వర ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం కాల్వల ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. హెలికాప్టర్‌లో నారాయణఖేడ్ వచ్చే సమయంలో నల్లవాగు ప్రాజెక్టును చూస్తే నిండుగా కనిపించిందని, ప్రాజెక్టును చూసి సంతోషం వేసిందన్నారు. నల్లవాగు ప్రాజెక్టు ద్వారా రెండు పంటలు పండాలంటే దానిపై లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు అవసరం అన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని మరోమారు గెలిపిస్తే నల్లవాగుపై లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామన్నారు. మాసాన్‌పల్లి రోడ్డు కావాలని, బీసీ గురుకుల పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలు కావాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరగా తాము అధికారంలోకి రాగానే వాటిని మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తండాలు అన్నింటికి రోడ్లు వేశామని తెలిపారు.

## ఎంపీపై కత్తితో దాడి హేయమైన చర్య

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడాన్ని సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లాలని అనుకున్నట్లు చెప్పారు. అయితే ప్రాణాపాయం లేదని తెలియడంతో ఖేడ్ ప్రజలు తనకోసం వేచిచూస్తున్నారని తెలిసి వచ్చినట్లు తెలిపారు. ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరిగిన నేపథ్యంలో మనస్సు బాధగా ఉందని, అందుకే ఎక్కువ సమయం ప్రసంగించటంలేదని, ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లాల్సివస్తున్నట్లు తెలిపారు. సభకు మంత్రి హరీశ్‌రావు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ప్రభాకర్‌రెడ్డికి మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పారు. ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, నాయకులు భూపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ రుబీనాబేగం మజీద్, వైస్‌చైర్మన్ పరశురాం, ఏఎంసీ చైర్మన్ సువర్ణ షెట్కార్, వైస్‌చైర్మన్ విజయ్‌బుజ్జి పాల్గొన్నారు.

**నారాయణఖేడ్ దశాదిశ మారింది...**

బీఆర్ఎస్ హయాంలో నారాయణఖేడ్ దశాదిశ మారిందని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో చాలాసార్లు నారాయణఖేడ్ వచ్చానని, మంత్రిగా ఉన్న సమయంలో నారాయణఖేడ్‌లో పర్యటించి అభివృద్ధి పనులు చేశానన్నారు. అప్పుడు నారాయణఖేడ్‌లో డబ్బారేకుల ఇండ్లు ఉండేవని, ఇప్పుడు హెలికాప్టర్‌లో నుంచి చూస్తే నారాయణఖేడ్ పట్టణం బాగా అభివృద్ధి చెందిందని, రెండు అంతస్తులు, మూడంతస్తుల భవనాలు కనిపించాయని తెలిపారు. గతంలో నారాయణఖేడ్‌కు ప్రభుత్వ ఉద్యోగులు రావాలంటే భయపడేవారని తెలిపారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు బ్రహ్మాండంగా ఇక్కడే ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. నారాయణఖేడ్‌కు ఆర్డీవో కార్యాలయం మంజూరు చేశామని, దీంతో చాలా వసతులు వచ్చాయన్నారు. ఉప ఎన్నికల్లో హరీశ్‌రావు ప్రచారం కోసం వస్తే చిమ్నీబాయి అనే మహిళ మంచినీళ్లు లేవు, మీకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని గెలిపించగానే ఇంటింటికీ తాగునీరు అందజేశామని తెలిపారు.

## సీఎం కేసీఆర్ బహిరంగసభ సైడ్‌లైట్స్

కంగ్టి, మనూరు, అక్టోబర్ 30:

- సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో నారాయణఖేడ్ సభాస్థలికి సాయంత్రం 4.27కు చేరుకుని, సభాస్థలి చుట్టూ రెండుసార్లు చక్కర్లు కొట్టారు.
- సాయంత్రం 4.41కి సీఎం కేసీఆర్ సభావద్దకు చేరుకుని ప్రజలకు అభివాదం తెలిపారు.
- సాయంత్రం 4.48 నిమిషాలకు సీఎం కేసీఆర్ నారాయణఖేడ్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగాన్ని ప్రారంభించారు.
- సాయంత్రం 4.59నిమిషాలకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు
- సాయంత్రం 5.00 గంటలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కూతురు శ్రీయారెడ్డి సీఎం కేసీఆర్‌కు మొక్కను అందజేశారు.
- సాయంత్రం 5.02 నిమిషాలకు సభాస్థలి నుంచి సీఎం కేసీఆర్ బస్సులో హెలీప్యాడ్ వరకు బయలు దేరాడు.
- సాయంత్రం 5.15 నిమిషాలకు నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ తిరుగు ప్రయాణం అయ్యారు.
- ముఖ్యమంత్రి కేసీఆర్ నారాయణఖేడ్‌లో జరిగిన ప్రజాఆశీర్వాదసభలో మాట్లాడిన పలుమాటలకు ప్రజలు కేరింతలు కొట్టి సంతోషాన్ని వ్యక్తం చేశారు.
- మాసన్‌పల్లి రోడ్డును తప్పకుండా మంజూరు చేస్తామని ప్రసంగంలో చెప్పినప్పుడు కల్హేర్ మండలానికి చెందిన ప్రజలు కేరింతలు కొట్టి హర్షం వ్యక్తం చేశారు.
- ప్రస్తుతం మెదక్ జిల్లాలో ఉన్న పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాలను సంగారెడ్డిలో కలుపుతామని ప్రసంగంలో సీఎం కేసీఆర్ వివరించినప్పుడు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.
- సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలో నారాయణఖేడ్ హీరో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అని చెప్పడంతో నారాయణఖేడ్ ప్రజలు కేరింతలతో నృత్యాలు చేశారు.
- కంగ్టి మండలంలో నీటికరువు గురించి, ఇక్కడి కష్టాల గురించి ఉపఎన్నికల్లో మంత్రి హరీశ్‌రావుకు సర్దార్‌తండాకు చెందిన చిమ్నీబాయిని గుర్తుచేసిన సీఎం కేసీఆర్ ఆమె అక్కడే సభాస్థలి వద్ద ఉండడంతో అభివాదం తెలిపారు.
- నారాయణఖేడ్‌లో ఎక్కువ, హైదరాబాదలో తక్కువగా ఉండే మీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని మరోమారు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సీఎం కేసీఆర్ తమ ప్రసంగాన్ని ముగించారు.
- సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాదసభలో పలువురు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి వచ్చే ప్రభుత్వంలో మంత్రి పదవి అందించాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

# గులాబీ జెండా ఎగరడం ఖాయం

- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్
- గడపగడపకూ చేరిన సంక్షేమ పథకాలు
- ఇంటింటికీ తాగునీరు
- ఖేడ్‌ను అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి



నారాయణఖేడ్, అక్టోబర్ 30: బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టి మళ్లీ హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కాబోతున్నారని, నారాయణఖేడ్‌లోనూ గులాబీ జెండా ఎగరడం ఖాయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడపగడపకూ చేరిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రజల దీవెనలతో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఎడారి లాంటి నారాయణఖేడ్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడంతోపాటు మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, కొత్తగా ఎనిమిది చెరువులను మంజూరు చేసి నియోజకవర్గంలో సాగునీటి వనరులను అందుబాటులోకి తెచ్చిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నీటి సమస్యతో కిలోమీటర్లు నడిచి నీరు తెచ్చుకునే పరిస్థితి ఉండగా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాలతో ప్రజల కష్టాలు తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. విద్య విషయానికి వస్తే ఎనిమిది గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడంతోపాటు మన ఊరు- మన బడి ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించామని చెప్పారు. నారాయణఖేడ్‌లో 150 పడకల దవాఖానను నిర్మించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను మెరుగుపర్చేందుకు కల్హేర్, కరస్‌గుత్తిలలో 30 పడకల దవాఖానలను ఏర్పాటు చేశామన్నారు. 17 కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తుండగా, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన రైతులు సైతం నారాయణఖేడ్‌లో ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. అంబులెన్స్‌లు సైతం పోలేని తండాలు, గ్రామాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేసి రవాణా సదుపాయాన్ని మెరుగుపర్చినట్లు చెప్పారు. రూ.100 కోట్లతో నారాయణఖేడ్-మాసాన్‌పల్లి డబుల్‌లేన్ రోడ్డు ఏర్పాటు చేయాలని, రూ.80 కోట్ల నిధులతో నల్లవాగు ప్రాజెక్టు ఎల్లప్పుడు నిండుకుండలా ఉండి రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరందే విధంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ వర్గాలను దృష్టిలో ఉంచుకుని నాలుగు బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, సీఎం కేసీఆర్‌ను విజ్ఞప్తి చేశారు.

**ఎమ్మెల్యేపై సీఎం కేసీఆర్ పొగడ్తల వర్షం**

నారాయణఖేడ్‌లో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డిపై పొగడ్తల వర్షం కురిపించారు. సౌమ్యుడిగా, భేషజాలు లేకుండా ఎల్లప్పుడు ప్రజల మధ్య ఉంటూ బ్రహ్మాండంగా అభివృద్ధి సాధించిన హీరో భూపాల్‌రెడ్డి అని కితాబిచ్చారు. తనకు ఎప్పుడు కలిసినా వ్యక్తిగత సమస్యలు చెప్పకుండా ఎప్పుడూ ప్రజావసరాల కోసమే అభ్యర్థించి కొత్త మండలాలు, ఇతర అభివృద్ధి పనులు మాత్రమే అడిగేవాడన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, చిమ్నీబాయి గురించి ప్రస్తావించి గతంలో ఇక్కడి నీటి సమస్యతో ప్రజలు పడ్డ బాధలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం నజీబ్, వైస్ చైర్మన్ ఆహీర్ పరశురామ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.